క్లుప్తంగా...

ఐటీఐలో 11న జాబ్‌మేళా

మేడ్చల్: మేడ్చల్‌లోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 11న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళాలో భాగంగా జాబ్‌మేళాతో పాటు అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. పలు బహుళజాతి కంపెనీల ప్రతినిధులు మేళాకు హాజరవుతారని ఐటీఐ ఉత్తీర్ణత చెందిన యువకులు ఉద్యోగాల కోసం మేళాకు హాజరుకావాలని ఆమె కోరారు.

కిష్టాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం



మేడ్చల్: పట్టణంలోని 4వ వార్డు కిష్టాపూర్‌లో మంత్రి మల్లారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సీఎంఆర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించి హాజరైన వారికి పరీక్షలు చేసి పలువురికి మందులను పంపిణీ చేశారు. శిబిరంలో కౌన్సిలర్ తుడుం గణేష్, వైద్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ట్రస్మా ప్రతినిధులు

మేడ్చల్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని ట్రస్మా రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ రెడ్డి అన్నారు. పట్టణంలోని సెయింట్ క్లారెట్ పాఠశాలలో మండల ప్రైవేటు పాఠశాలల యజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన పాల్గొని ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, దాని విలువను కాపాడాల్సిన బాధ్యత అందరిదని అన్నారు. సమావేశంలో సంఘం నాయకులు గిరిబాబు, రామేశ్వర్‌రెడ్డి, మంజుల ప్రకాష్, రాధాకృష్ణ, రమేష్, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బృందం సభ్యులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌ఐటీ కళాశాలలో శనివారం ఇకో క్లబ్, టీమ్ ఆయుద ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, ఉన్నతమైన విద్య, ఆరోగ్యకరమైన జీవితం, యువతకు యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని క్లబ్ అధికారులు శ్రీకాంత్, ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

15 తులాల ఆభరణాలు ఎత్తుకెళ్లిన దొంగలు



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలోని దొంగలు రెచ్చిపోయారు. తాళం వేసిన ఇంట్లోకి అర్ధరాత్రి చొరబడి రూ.15 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, రూ.60 వేల నగదు దోచుకెళ్లారు. బాధితుడు అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని కేఎల్‌ఆర్ ఫేజ్– 2లోని శుభం అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ నెంబర్ 103లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. నెల రోజుల క్రితం అశోక్‌రెడ్డి తల్లి మరణించడంతో కుటుంబ సభ్యులంతా స్వగ్రామమైన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామానికి వెళ్లారు. అశోక్‌రెడ్డి కుటుంబసభ్యులు నాలుగు రోజులకు ఒకసారి మేడ్చల్‌కు వచ్చి ఇంటిని చూసుకుని శుభ్రం చేసి వెళ్తున్నారు. ఇదే అదనుగా భావించిన దొంగలు ఇంట్లోని 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.60 వేల నగదు దోచుకెళ్లారు. బాధితుడు అశోక్‌రెడ్డి మేడ్చల్ పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. సీసీ కెమెరాలు పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేక్ కట్ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి



త్రైలోక్య మోహన చండీ హోమంలో..



ఘనంగా మంత్రి మల్లారెడ్డి జన్మదిన వేడుకలు

మేడ్చల్‌రూరల్: రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి జన్మదిన వేడుకలను శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. మంత్రి జన్మదినం సందర్భంగా యూనివర్సిటీ ప్రాంగణంలో పెద్ద ఎత్తున త్రైలోక్య మోహన చండీ హోమం నిర్వహించారు. మంత్రి మల్లారెడ్డి–కల్పన దంపతులతో పాటు కుమారులు మహేందర్‌రెడ్డి, భద్రారెడ్డి, కోడళ్లు శాలినీరెడ్డి, ప్రీతిరెడ్డి, సోదరుడు గోపాల్‌రెడ్డి, కుటుంబీకులు, బంధువులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణలతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు హోమం జరిగింది. అనంతరం గోపూజ నిర్వహించారు. తన జన్మదినం సందర్భంగా మంత్రి తన కుటుంబీకులు, గుండ్లపోచంపల్లి మున్సిపల్ పాలకవర్గంతో కలిసి మొక్కలు నాటారు.

పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు..

మంత్రి మల్లారెడ్డి జన్మదినం సందర్భంగా నిర్వహించిన త్రైలోక్య మోహన చండీ హోమంలో కుత్బుల్లాపూర్, ఉప్పల్ ఎమ్మెల్యేలు వివేకానంద, బేతి సుభాష్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, మల్కాజిగిరి పార్లమెంట్, కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొన్నారు. మంత్రి మల్లారెడ్డి తన జన్మదినం సందర్భంగా నియోజకవర్గంలోని డ్వాక్రా గ్రూప్ మహిళలకు మల్లారెడ్డి మెడికల్ హబ్ ద్వారా ఉచితంగా హెల్త్ కార్డులు అందజేశారు.



గో మాతకు పూజలు నిర్వహిస్తున్న మంత్రి, కుటుంబికులు



మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న జవహర్‌నగర్ మేయర్ కావ్య, కార్పొరేటర్లు



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఘట్‌కేసర్ చైర్ పర్సన్ పావనీజంగయ్య



చీర్యాల లక్ష్మీనృసింహస్వామి చిత్రపటాన్ని బహుకరిస్తూ....



సంస్కృతి టౌన్‌షిప్‌లోని అనాథాశ్రమంలో కేక్ కట్ చేస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

జోరుగా అభివృద్ధి పనులు



చీర్యాలలోని సాయినగర్‌కాలనీలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ తుంగ ధర్మేందర్

కీసర: చీర్యాల గ్రామంలోని వివిధ కాలనీల్లో పంచాయతీ నిధులను వెచ్చించి పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ తుంగ ధర్మేందర్ అన్నారు. శనివారం పంచాయతీ పరిధిలోని సాయినగర్‌కాలనీలో సుమారు రూ.13 లక్షల పంచాయతీ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు, అంతర్గత మురుగు కాల్వ నిర్మాణ పనులతో పాటు దాత అందజేసిన మరో రూ.లక్షతో కాలనీలో పార్కు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పాలకవర్గం సహకారంతో గ్రామంలో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం చీర్యాల గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న గణపతి దేవాలయ నిర్మాణానికి రూ.3.5 లక్షలను విరాళంగా అందజేసిన ఎల్లూరి యాదయ్యను సత్కరించారు. ఉపసర్పంచ్ జిల్లాల తిరుమల్‌రెడ్డి, వార్డు సభ్యులు నేతలు రామిడి శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, హనుమంత్‌రెడ్డి, రాంరెడ్డి, శశిధర్‌రెడ్డి, ఆంజనేయులు, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నేతాజీనగర్‌కాలనీలో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

నాగారం మున్సిపాలిటీలో..

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని నేతాజీనగర్ కాలనీలో రూ.7.5 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ పనులను శనివారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ బదనపురం శ్రీనివాస్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు

మేడ్చల్: మేడ్చల్ బీజేపీ టికెట్ తనకు కేటాయించాలని కోరుతూ మేడ్చల్‌కు చెందిన బీజేపీ నాయకుడు రామన్నగారి శ్రీనివాస్‌గౌడ్ దరఖాస్తు చేసుకున్నారు. ఆయన నగరంలోని బీజేపీ కార్యాలయానికి వెళ్లి తన బయోడేటాను జతపరిచి మేడ్చల్ బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆయన వెంట పట్టణ బీజేపీ నాయకులు ఆంజనేయులు, సీహెచ్.శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్ తదితరులు ఉన్నారు.



టికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటున్న శ్రీనివాస్‌గౌడ్

సీఎం కేసీఆర్‌ను కలిసిన మంత్రి మల్లారెడ్డి



మేడ్చల్‌రూరల్: రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి జన్మదినం సందర్భంగా ఆయనకు సీఎం కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం మంత్రి తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రగతిభవన్‌కు వెళ్లారు. సీఎం కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మంత్రి మల్లారెడ్డిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రితో కుమారులు మహేందర్‌రెడ్డి, భద్రారెడ్డి, అల్లుడు మల్కాజిగిరి పార్లమెంట్, కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి, మనవరాలు ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై స్పందించాలి



ఎంపీపీకి వినతి అందజేస్తున్న జిల్లా అధ్యక్షురాలు సుచిత్ర, అంగన్‌వాడీ టీచర్లు

ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: అంగన్‌వాడీల రాష్ట్ర వ్యాప్త సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు సుచిత్ర ఆధ్వర్యంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డికి పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, మరణిస్తే ప్రభుత్వం రూ.లక్ష ఇస్తామనడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే బతుకులు మారుతాయని భావించి చేసిన ఉద్యమంతో ఫలితం శూన్యమన్నారు. ధనిక రాష్ట్రంలో అంగన్‌వాడీలకు కనీస వేతనం అందకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

షేర్‌చాట్‌పై మ్యూజిక్ కార్నివాల్

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సోషల్ మీడియా వేదిక షేర్‌చాట్.. మ్యూజిక్ కార్నివాల్ పేరుతో ఈ నెల 15వ తేదీ వరకూ సంగీత పండగను సమర్పిస్తోంది. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. దీనిలో భాగంగా వినియోగదారులు 90ల నాటి అద్భుతమైన పాటల్ని వినవచ్చని, అలాగే 10 భాషల్లోని ప్రైవేట్ ఆల్బమ్స్, టేలెస్ట్ హిట్ సాంగ్స్.. మ్యూజిక్ ట్రెండ్స్.. అందుకోవచ్చని వివరించారు. అంతేగాకుండా వినియోగదారులు తమ సొంత సంగీత వీడియోలను సైతం రూపొందించుకోవచ్చని అన్నారు.

అనురాగ్ యూనివర్సిటీలో జీ-20 సమ్మిట్



ఏయూా జీ-20 సమ్మిట్ ర్యాలీలో సీటీఓ మల్లేశ్, ఎన్‌సీసీ క్యాడెట్లు

ఘట్‌కేసర్: జీ–20 సదస్సును పురస్కరించుకొని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో ఎన్‌సీసీ క్యాడెట్లు, సీటీఓ మల్లేశ్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఎన్‌సీసీ క్యాడెట్లు శనివారం ×జీ–20 వసుధైక కుటుంబం¤ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. క్యాంపస్‌లో క్యాడెట్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీటీఓ మల్లేశ్ మాట్లాడుతూ జీ–20 సదస్సులో ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లు, పేదరికం, సంఘర్షణలను పరిష్కరించుకోవడానికి ప్రపంచ దేశాల మధ్య గౌరవం, సహనం, సహకారం కోసం ఐక్యంగా ఆలోచిస్తారన్నారు. జీ–20 సదస్సు ఒకరి సంక్షేమ అందరి సంక్షేమంగా భావించి ప్రపంచాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

అడ్రస్ లేని ఇంటిగ్రేటెడ్ మార్కెట్



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కోసం ప్రతిపాదించిన ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్ స్థలం



మేడ్చల్ మార్కెట్‌లో రోడ్లపై పూల దుకాణాలు

- శంకుస్థాపనకే పరిమితమైన ఆధునిక మార్కెట్
- వారాంతపు సంతలపైనే ఆధారపడుతున్న ప్రజలు
- ఏడాది క్రితం శంకుస్థాపన చేసి.. ఆపై మరిచి..
- నిధులు మంజూరైనా పనులు మరూ కాలేదు..

మేడ్చల్: ప్రజలకు నిత్యావసరాలైన కూరగాయలు, పూలు, పండ్లు, మాంసం ఇతర వస్తువుల కోసం ప్రభుత్వం మేడ్చల్ మున్సిపాలిటీలో ఏర్పాటు చేయాలనుకున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రతిపాదనలకే పరిమితమైంది. ఏడాది క్రితం మంత్రి మల్లారెడ్డి మేడ్చల్‌లో వెజ్, నాన్ వెజ్ మార్కెట్(ఇంటిగ్రేటెడ్ మార్కెట్) నిర్మాణం కోసం శంకుస్థాపన చేసినా.. ఇప్పటికీ పనులు మాత్రం మొదలు కాలేదు. జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు పలుమార్లు స్థలాన్ని సందర్శించారు. అయినా నిర్మాణం కోసం ఇటుక సైతం పడలేదు.

మార్కెట్‌కు రూ.5.5 కోట్లు

మేడ్చల్‌లో జాతీయ రహదారి పక్కన ఉన్న ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్(డాగ్ బంగ్లా) స్థలంలోని రెండున్నర ఎకరాల్లో అన్ని వసతులతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కౌన్సిల్‌లో ఏడాది క్రితం తీర్మానం చేశారు. మార్కెట్ ఏర్పాటు కోసం రూ.5.5 కోట్లు మంజూరు చేసి రూ.2 కోట్లు మున్సిపల్ వాటా కింద ఖర్చు చేసి మార్కెట్‌ను నిర్మించాలని అప్పట్లో ప్రతిపాదనలు చేశారు. దానికి అనుగుణంగానే మార్కెట్ నిర్మాణం చేయాలని మంత్రి మల్లారెడ్డి ఆరు నెలల క్రితం శంకుస్థాపన చేసి శిలాఫలకం వేశారు.

వారాంతపు సంతలపైనే..

మేడ్చల్ పట్టణంలో కూరగాయాలు, పూలు, పండ్లు ఇతర సామాగ్రి లభించే వస్తువుల కోసం ప్రత్యేక మార్కెట్ లేకపోవడంతో ప్రజలు వీధి వ్యాపారాలపై ఆధారపడాల్సి వస్తుంది. కూరగాయాల మార్కెట్ కింది బస్తీలో ఉన్నా అది సరిపోవడం లేదు. పూలు, పండ్లు రోడ్లపైనే విక్రయాలు చేస్తున్నారు. దీంతో ఒక్కో వస్తువు కోసం ఒక్కో ప్రాంతానికి తిరగాల్సి వస్తోంది. వివిధ కాలనీల్లో వ్యాపారస్తులు వారాంతపు సంతలు నిర్వహిస్తూ కూరగాయాలు, ఇతర వస్తువులను విక్రయిస్తున్నారు. వీటిపైనే పట్టణ ప్రజలు ఆధారపడుతున్నారు.

సంతల్లో సమస్యలు..

వారాంతపు సంతల వల్ల కాలనీల్లో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. కాలనీలోని ప్రధాన రోడ్లపై వ్యాపారులు స్టాల్స్ ఏర్పాటు చేయడంతో సంత రోజు కాలనీవాసులు సాయంత్రం వేళలో వాహనాలపై బయటకు రావాలంటే ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనం కూడా వచ్చే అవకాశం లేదు. చైన్ స్నాచింగ్, జేబు దొంగతనాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. వర్షాకాలంలో సంతల్లో వ్యాపారులు కూరగాయాలు విక్రయించేందుకు అనేక అవస్థలు పడుతున్నారు.

దాయరకుంటలో పడి వ్యక్తి మృతి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని దాయరకుంటలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. కీసర సీఐ ఎం.వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం నాగారం మున్సిపాలిటీకి చెందిన బత్తుల సురేష్(42) వృత్తిరీత్యా కాటికాపరిగా జీవనం వెళ్లదీస్తుంటాడు. శనివారం ఉదయం దాయరకుంటలో మృతదేహం తేలి ఉందని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయగా మృతి చెందిన వ్యక్తి బత్తుల సురేష్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు మద్యం తాగి ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు, స్థానికులు భావిస్తున్నారు.

లోక్ అదాలత్‌లతో కేసుల సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న న్యాయమూర్తి బీఆర్ మధుసూదన్‌రావు

కుషాయిగూడ: కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లు చక్కటి వేదికలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ మధుసూదన్‌రావు అన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కుషాయిగూడలోని మేడ్చల్ జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 22 బెంచ్‌లను ఏర్పాటు చేసి 79,639 కేసులకు పరిష్కారం చూపి పరిహారంగా రూ.1.13 కోట్లను చెల్లించినట్లు న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ డి.విజయేందర్‌రెడ్డి, జిల్లా అదనపు న్యాయమూర్తి ఆర్.రఘునాథ్‌రెడ్డి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి డి.కిరణ్‌కుమార్, కుషాయిగూడ, మల్కాజిగిరి ఏసీపీలు వెంకట్‌రెడ్డి, సుకుమార్, ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్‌కుమార్, మల్లికార్జున్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట రామచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కుషాయిగూడ: గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున సైనిక్‌పురి నుంచి ఈసీఐఎల్ వైపు నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని వేగంగా దూసుకొచ్చిన కారు ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు వివరాల కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు.